
చివరిదశలో కొడుకుని ఓదార్చిన ఆ తల్లి ప్రేమ వర్ణించతరమా?

# అమ్మ మనసు




చిరంజీవి అనంతశర్మను మీ అమ్మ ఆశర్వదిస్తూ రాస్తోన్న చివరి ఉత్తరం.

బాబూ... పాతిక సంవత్సరాల తర్వాత ఉత్తరం రాస్తోన్న ఈ తల్లిని క్షమించు. కేవలం నాకు చెప్పకుండా మన కులంకాని అమ్మాయిని ప్రేమించి పెళ్లిచేసుకున్నావన్న కోపంతో నన్ను చూడొద్దని, చచ్చేవరకూ మాట్లాడవద్దని శాసించాను.

నేను చచ్చినా నాకు తలకొరివి పెట్టకూడదని తిట్టిపోశాను. ఈ పాతిక సంవత్సరాల్లో నువ్వెన్నోసార్లు నన్ను చూడాలని, కలవాలని ప్రయత్నించినా నానుంచి ఛీత్కారాలకు గురయ్యావు. ఇప్పుడర్థమవుతోంది. నువ్వెంత క్షోభ అనుభవించి వుంటావో! నీకు ఈ ఉత్తరం చేరేలోగా నేను చనిపోయానన్న కబురు అందినా అందవచ్చు. నా తల్లి చివరి క్షణాల్లో మాట్లాడలేదని నువ్వు జీవితాంతం బాధపడకూడదు. ఇప్పటికే పాతిక సంవత్సరాల శిక్ష విధించాను.

వస్తున్నాను బాబూ... రెక్కలు కట్టుకుని ఈ తల్లే నీ ముందు తల వంచుకుని, చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తంగా నిన్ను అక్కున చేర్చుకుని, నా కన్నీళ్లలో పాప పరిహారం చెల్లించుకోవడానికి, నా ఊపిరి ఏమాత్రం నిలిచి వున్నా వచ్చేస్తాను. కోడలిపిల్లకు, పిల్లలకు నా ఆశీస్సులు.

మీ అమ్మ
శారదమ్మ

ఆ ఉత్తరం చదువుకున్న అనంతశర్మ కళ్లు కన్నీళ్లతో మెరిశాయి.

"వైదేహీ... వైదేహీ... పెళ్లయిన కొత్తలో ప్రమోషన్ వస్తే భార్యకు ఆనందంతో



ఆ వార్త చెప్పడానికి ఎంత ఆనందంతో పరుగెత్తుకొచ్చాడో, అంతే ఆనందంతో వంటగదిలోకి పరుగెత్తి భార్యకు ఉత్తరం అందించాడు.

పెళ్లయిన పాతిక సంవత్సరాల్లో భర్తలో ఈ ఆనందాన్ని ఏ రెండుమూడు సార్లో చూసి వుంటుందంతే!

ఉత్తరం చదివాక వైదేహికి కూడా

సంతోషం కలిగింది. కనీసం అత్తగారు ఎలా వుంటుందోకూడా తెలియదు. పెళ్లయిన వెంటనే ఆశీస్సులకోసం వెళ్తే తలుపు దఢాలు న వేసుకుని బయటకు పంపించింది. తన భర్తయితే ఎన్నోసార్లు తల్లిని కలవాలని ప్రయత్నించాడు. చివరిసారిగా "మవ్వు నా గుంటిగడప తొక్కితే 'ఉరి' పెట్టుకు చస్తాను నేను చచ్చినా నా తలకొరివి పెట్టకూడదు పెడితే నా మీద ఒట్టే" అనడంతో తల్లిమీద ప్రేమను మనసులోనే దాచుకున్నా డు.

ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాడు తన భర్త. ఇప్పుడు... ఇప్పుడీవార్త భర్తకు ఎంత ఆనందాన్ని కలిగిస్తుందో తెలుసు.

"వైదేహీ... అమ్మే వస్తుంది. లేకపోతే ఓ పని చేద్దాం... రేపు ఉదయమే మనం అమ్మ దగ్గరకు బయల్దేరుదాం. అమ్మాయిని, అబ్బా యిని కూడా తీసుకెళ్దాం. అమ్మకూడా వాళ్లను చూపినట్టు వుంటుంది. ఇక్కడికి తీసుకువచ్చి పెద్ద హాస్పిటల్లో జాయిన్ చేద్దాం. అవసరమైతే మన ఇంట్లో వున్న వస్తువులన్నీ అమ్మి అయినా సరే అమ్మ జబ్బును బాగుచేసుకుందాం. మెరిసే కళ్లతో చెప్పుకుపోతున్నాడు అనంతశర్మ.

ఆనందంలో ఆ సాయంత్రం అన్నంకూ డా తినలేకపోయాడు.

చలికాలం.

సాయంత్రం ఆరు దాటింది. అప్పటికే చీకట్లు కమ్ముకున్నాయి. అనంతశర్మ కొడు కు, కూతురు టి.వి చూస్తున్నారు.

వైదేహి వంటగదిలో సామాను సర్ది హాలులోకి వచ్చింది. అప్పుడే ఇంటిముందు తలుపు తట్టిన శబ్దం వినిపించింది.

తల్లి ఆలోచనల్లోంచి బయటపడి, అనం తశర్మే వెళ్లి తలుపు తీశాడు.

ఎదురుగా ఊహించని అద్భుతం.

ఎదురుచూడని సంభ్రమం!

తల్లి... పాతికేళ్ల తర్వాత తన మనసు తలుపు తట్టిన తల్లి.

శుష్కించిన శరీరాన్ని బలవంతంగా మోసుకొచ్చింది.

వృద్ధాప్యానికి గుర్తుగా నెరిసిన వెంట్రుక లు, క్షీణించిన శరీరం.

"అ...మ్మా..."

ఒక చిన్న పదం ఎంతటి ఆనందాన్ని, ఉద్వేగాన్ని కలిగిస్తుందో అప్పుడు అర్థమైంది అనంతశర్మకు. తల్లి పాదాలపై పడిపోయా డు. అప్పుడే హాలులోకి వచ్చిన వైదేహి కళ్లు చెమర్చాయి ఆ దృశ్యాన్ని చూసి.

కొడుకు, కూతురు ఆశ్చర్యంగా, ఆనం దంగా ఆ దృశ్యాన్ని వీక్షిస్తున్నారు.

"రా... అమ్మా... ఇదిగో నీ కోడలు... వీడు... వీడు నీ మనవడు. పేరేమిటో తెలుసా... అచ్యుత రామశర్మ. నాన్న పేరే. ఇది నీ మనవరాలు. నీ పేరే... శారద...

తల్లి ముఖం చూస్తూ సంబరంగా చెప్పాడు. క్షణకాలం తల్లి కళ్లలో కన్నీటి మెరుపు.

అమ్మా... ఇన్నాళ్లకు నామీద కోపం పోయిందా? అనంతశర్మ గొంతు గాద్గికమైం ది.

ఒక్కో క్షణాన్ని అపురూపంగా చూసు కుంటున్నాడు అనంతశర్మ. మనవరాలిని, మనవడిని, కోడలిని అక్కున చేర్చుకుంది

శారదమ్మ.

o p o

రాత్రి పది దాటింది.

అనంతశర్మ గదిలో తన మంచంమీద తల్లికి పడక ఏర్పాటుచేశాడు. మనంచ ప్రక్కనే కింద చాప, దుప్పటి పరిచింది. తమ పడకను కిందికి మార్చుకున్నారా దంపతులు.

తల్లి మంచంమీద కూచుంది.

వైదేహి హాలులోకి వచ్చింది. తల్లీ కొడుకులను కాసేపు ఒంటరిగా వదలాలని ఆవిడ ఉద్దేశం.

తన భర్తకు తల్లిమీద ఉన్న ప్రేమ ఎలాంటిదో తెలుసు. మంచం కింద కూచుని తల్లి ఒడిలో తల పెట్టుకున్నాడు.

కళ్లు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. పాతికేళ్లుగా అతని కనుకొలుకుల్లో బందీగా వున్న కన్నీళ్లు బంధనాలు తెంచుకున్నాయి.

''అమ్మా... నేను చచ్చేలోగానైనా నువ్వు క్షమిస్తావో లేదోననుకున్నాను. చాలమ్మా... నాకోసం జీవితపు చివరి క్షణాల్లోనైనా నన్ను క్షమించావు. అమ్మా ఈ పాతిక సంవత్సరాలు నువ్వెంత క్షోభ అనుభవించావో... చూడమ్మా... నీ మనవరాలు, నీ మనవడు. వీళ్లిద్దరి పెళ్లిళ్లు నీ చేతుల మీదుగానే నీకు నచ్చిన వాళ్లతోనే జరగాలమ్మా... ఇంకెప్పుడూ... నన్ను శపించకమ్మా.... ఈ జన్మకీ వరం చాలమ్మా... పాతికేళ్ల తర్వాత నిన్ను కలిసే వరం నాకు చాలమ్మా...''

అనంతశర్మ గొంతు వణుకుతోంది. ఈ పాతికేళ్లుగా దూరమైన తల్లి ప్రేమను పదిలపర్చుకుంటున్నాడు. అలాగే... అ...లా...గే తల్లి ఒడిలో నిద్రపోయాడు.

o p o

ఎవరో తలుపు బాదుతోన్న శబ్దం. ఇంకా పూర్తిగా తెల్లవారనే లేదు.

బద్ధకంగా కళ్లు తెరిచాడు అనంతశర్మ. తల్లికోసం చూశాడు. తల్లి కనిపించలేదు.

## సంబంధం

''మీ భర్త ఆత్మహత్యకు కారణం?'' అడిగాడు లాయర్.

''మన మధ్య ఉన్న అక్రమ సంబంధం'' చెప్పింది వనజం.

— జనార్దన్ గూటి (చంద్రగిరి)



తన తలకింద దిండు వుంది.

భార్య అప్పుడే నిద్రలేచింది.

అమ్మ ఎక్కడికెళ్లింది వైదేహీ? భార్యను అడిగాడు.

సమాధానం చెప్పేలోగా మళ్లీ ఇంటిముందు తలుపు తట్టిన శబ్దం.

శర్మ వెళ్లి తలుపులీశాడు. ఎదురుగా దాసు. తల్లికి కుడి భుజంగా వుండే పాలేరు.

"దాసూ... నువ్వా... రా... ఏంటీ? ఇప్పుడొచ్చావు?" అడిగాడు పక్కకు జరిగి దారి ఇస్తూ.

"అతని గొంతు పూడుకుపోతోంది.

"ఘోరం జరిగిపోయినాది బాబూ. అమ్మగారు నిన్న సాయంత్రమే పోయారు. చచ్చేముందు మిమ్మల్నే కలవరించినారు" వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ చెప్పాడు దాసు.

ఉలిక్కిపడ్డాడు అనంతశర్మ.

వైదేహి స్థాణువైంది.

ంటిదాసూ... నువ్వు చెప్పేది?"

"అవును బాబుగోరు... చనిపోయేముందు మిమ్మల్ని ఎలాగైనా కలవాలనుకుంది. మీకో ఉత్తరం కూడా రాసి నన్నే పోస్టు చేసి రమ్మంది. ఒరేయ్ దాసూ... మనం అబ్బాయి దగ్గరికి వెళ్దాం. ప్రయాణానికి ఏర్పాట్లు చేయురా... అంది. ఇంతలోనే పోతారనుకోలేదు" ఏడుస్తూనే చెప్పాడు దాసు.

కూలబడిపోయాడు అనంతశర్మ.

అమ్మ చనిపోయిందా?

తన దగ్గరకు వచ్చి, తన చేతిలో అన్నం తిని తనని ఒడిలో సేదదీర్చిన అమ్మ చనిపోయిందా... అంటే నిన్న సాయంత్రం అక్కడ అమ్మ చనిపోయి... అమ్మ ఆత్మ కాదు... కాదు... అమ్మ మనసు ఆత్మగా తన దగ్గరకు వచ్చి తనని ఓదార్చి జీవితాంతం తను అమ్మతో మాట్లాడలేకపోయాననే క్షోభ అనుభవించకుండా...

"అమ్మా... మోకాళ్లమీద కూలబడి ఏడుస్తున్నాడు అనంతశర్మ. ●